# అర్థంకాని బాధ

ఈ మధ్య ఒక చిత్రమైన అనుభూతి కలిగింది. దానిని గురించి ఎవరితోనైనా చెప్పకుంటేనే కాని తోచదు. కొన్ని అనుభూతులు అంతే. ఒక వ్యాసరూపంగానో, కథగానో, కావ్యంగానో ప్రత్యక్షమై ప్రపంచాన్ని ఉద్ధరించడానికి బయలుదేరే పర్యంతం పట్టి బాధిస్తాయి.

నా యీ చిన్ని వ్యాసానికి సంబంధించిన ఇతివృత్తంలో అనుభూతి పొందడం వరకు మాత్రమే నావంతు. ఆ జరిగిన సంఘటనలో నేనొక ప్రేక్షకుణ్ణి. పాత్రధారుణ్ణి కాదు. అలాంటప్పుడు ఈ 'నేను' కూడా ఎందుకు కలుపుతావయ్యా పెద్దమనిషీ అని ఎవరైనా ప్రశ్నించవచ్చు. 'అహం' చంపుకోమని పెద్దలు బోధిస్తారు. కాని ఈ 'అహమే' ఎక్కువగా కలవాణ్ణి అందలం ఎక్కిస్తారు.

ఇంతకీ జరిగిన దిది. రైలుబండిలో ప్రయాణం చేస్తున్నాను. ఇంటర్ క్లాస్ పెట్టె. నిజానికి నా కథకు రైలుపెట్టె ఇంటర్ తరగతికి చెందిన విషయానికి సంబంధంలేదు. అవసరమైన విషయాలతోపాటు కొన్ని అనవసరమైన అంశాలు కూడా చేర్చడం రచయితలకు పరిపాటి. లోపం అని కొందరనవచ్చు.

రాత్రిసమయం. మెయిలేమో బహువేగంగా పోతూ ఉంది.

ప్రయాణాలు చెయ్యడంవల్ల పది ఊళ్ళు చూడడము, విశాలమైన హృదయకోశాన్ని సువిశాలం చేసుకొనడం విజ్ఞానం సంపాదించడానికి ప్రథమసోపానం. ఇవన్నీ మనకు కొట్టినపిండి.

నా ప్రయాణానికి మాత్రం విజ్ఞానంతో ఎట్టి సంబంధము లేదు. నే నిప్పటికి మూడు సంవత్సరాలుగా చేస్తున్న చెప్పుల వ్యాపారానికి సంబంధించినది.

ఆ పెట్టెలో కూర్చోడానికి కాదుకదా, కాలు మోపడానికి కూడా నలుసంతయినా సందులేదు. తలుపుకు ఒక వైపున వున్న ఇనపకమ్మీ పట్టుకుని, శరీరాన్ని తలుపుకు చేర్చి, క్రిందపడిపోకుండా గుమ్మానికి రెండువైపులా కాళ్ళు గట్టిగా పోటీపెట్టి తపస్సులో పడ్డాను.

అప్పటికి రాత్రి రెండు గంటలు దాటింది. నిద్ర ముంచుకువస్తోంది. అసందర్భంగా వున్న సమయాల్లో నిద్రాదేవత మరీ విజృంభిస్తుంది. ఇప్పటి అవస్థకు తోడు నిత్యనైమిత్తిక జీవిత నిర్వహణంలో పడుతున్న బాధలు కూడా తలపుకు వస్తే, క్రిందకు దూకి, మానవ శ్రేయస్సుకోసం (నా బాధ ఇతరులకు లేకుండా చేసే నిమిత్తమని గిట్టనివాళ్ళు చెప్పవచ్చు) ప్రాణత్యాగం చేద్దామనిపిస్తుందేమోనని భయం వేసిన మాట వాస్తవం. అంచేత కాంగ్రెసు ఆదర్శాలు నెమరువేసుకుంటూ, త్వరలోనే దేశంలో ప్రతి ఒక్క ప్రయాణీకుడికి పడుకోడానికే కాదు, హాయిగా చావడానికి కూడా తగినంత జాగా రైలుబళ్ళల్లో దొరుకుతుందని కలలు కంటున్నాను.

కాని, మొదటినుంచీ నా దృష్టిమాత్రం (వెనకటి సామెతల్లో ఒక మంచి సామెతలాగ) ఎదురుగా బల్లమీద కూర్చున్న యువదంపతులమీదనే వుంది. ఆ విధంగా 'అపరిచితులు, తరుణవయస్కులు' అయిన ఆ యువదంపతుల వైపు నేను తదేక దృష్టితో చాలసేపు చూడడం ఆ పెట్టెలో మరెవ్వరికీ తెలియదు. అంతవరకెందుకు? చాలసేపటిదాకా నాకే తెలియదు. ఆ రైలు పెట్టెలో ఉన్నవారందరు గాఢనిద్రలో మునిగి ఉన్నారు. ప్రపంచాన్ని పరిశీలించడానికి అనుకూలమైన పరిస్థితి.

ఆ దంపతులకు బహుశా కొత్తగా వివాహం అయి వుండవచ్చు. ఈ అభిప్రాయం తప్పని ఎవరైనా అన్నట్లయితే అయివుండకపోవచ్చునని అంగీకరించి రాజీ పడడానికి నేను సిద్ధం.

భర్త బల్లచివర కూర్చున్నాడు. అతని సరసనే భర్తను కొంచెం ఆనుకుని అతని భార్య కూర్చున్నది. ఆమె కవతల మరొక యువకుడు కూర్చుని వున్నాడు. ఆ యువకుడు మన యువదంపతులకు ఏమీ కాడని చెప్పడానికి అతను స్మృతి వున్న సమయంలో కూర్చున్న వైఖరి నిదర్శనం. మొదట్లో, తగలకుండా దూరం దూరంగా కూర్చున్నాడు. నిద్ర పైబడ్డకొలది కాళ్ళు ముందు బల్లక్రిందకు చాచి, కొంచెం కొంచెంగా ప్రక్కకు వాలి, చివరికి తల ఆ యువతి భుజానికి ఆన్చి సుఖంగా నిద్రపోయాడు.

ఆమె సంగతి. అంతవరకు నిద్ర ఆపుకుంటూవచ్చింది. ఇక శక్తిలేని స్థితిలో కళ్ళు వాటంతట అవే మూతపడి

పోయాయి. తల రెండు మూడు సార్లు అటూ ఇటూ ఊగి, చివరికి ఆ పక్క యువకుని తలకు ఆనుకుంది.

ఇక భర్త కొత్తగా వివాహం అయిందేమో, ఒక రకంగా చాల బాధాకరమైన దశలో వున్నాడు. భార్య సర్వకాలసర్వావస్థల్లో తనవైపే చూస్తూ, తనతోటే మాట్లాడుతూ, తతిమ్మా ప్రపంచంతో సంబంధం లేనట్లు, అసలా ప్రపంచమే లేనట్లు వుండాలని భర్త కోరుకోనవచ్చు. ఒకవేళ భార్య మరెవరివైపు అయినా దృష్టి సారించిందా, అవతలి వ్యక్తిని చీల్చి చెండాడి, ముక్కలు చేయాలని అనిపించవచ్చు.

ఇది ఆత్మసంయమనం కలిగిన మహనీయుల సంగతి కాదు. అప్పుడప్పుడే యవ్వనంలో అడుగుపెట్టి, నరాల్లో ఉష్ణరక్తం ప్రవహిస్తున్న సామాన్య యువకుల విషయం. అతనుమాత్రం మొదటినుంచీ నిద్రపోకుండా అలాగే కొరివిలా కూర్చుని, రాధ పరిశోధక నవల ఒకటి చదువుకుంటున్నాడు. భార్య కొంచెం పక్కకు ఒత్తిగిలినట్లు అనిపించిందేమో అటు చూచాడు. ఆమె స్థితి గోచరించింది. బాధ కలిగింది. చేతితో ఆమె భుజంమీద నెమ్మదిగా తట్టాడు. ఆమెలో చలనం లేదు. కొంచెం గట్టిగా తట్టాడు. ఆమె కదిలింది. అప్పుడు కొంచెం అపవారించి, "ఏయ్! ఇవతలకి జరుగు!" అన్నాడు.

ఆమె కళ్ళు బలవంతంగా తెరచుకుంది. అలాగే భర్త వైపు అర్థంకాని చూపులు చూస్తూ, భర్తకు దగ్గరగా

జరిగింది. గండం గడవగానే భర్త తిరిగి పుస్తకంలో లీన మయ్యాడు.

అవతలి యువకుడు తలకు పోటీలేక పోవడంతో కళ్ళు తెరచి, పక్కయువతిమీద పడుతున్నందుకు బాధపడి, అటు వైపు మొగ్గి, తిరిగి నిద్రలోపడ్డాడు.

ఇటు ఈమెకూడా తిరిగి నిద్రలో పడింది. మరి రెండు నిమిషాలవ్యవధికి ఆ ఇరువురు మొదటిస్థితికి వచ్చేశారు. నీరు పల్లాన్ని వెతుక్కున్నట్లుగానే నిద్రలో ఉన్న శరీరం కూడా సుఖం వెతుక్కుంటుంది.

ఈ దృశ్యం తిరిగి కంటపడగానే ఆ భర్తకు కోపం వచ్చిందనే చెప్పాలి. ఈసారి గట్టిగానే "ఇవతలికి జరుగు!" అని భార్యను గదమాయించాడు. ఆమె అతి కష్టంమీద నిద్రలోంచి బయటపడి, ఎత్తలేక ఎత్తలేక ఎలాగో కంటి రెప్పలు సగంవరకు పైకెత్తి భర్తవైపు చూసింది. భర్తకు కోపంవచ్చినట్లు ఆమె హృదయం తెలుసుకుంది. కాని, ఎందుకోమాత్రం ఆమె మెదడుకు అర్థంకాలేదు. తెలుసుకో డానికి తగినంత ఓపికలేదు. శరీరం ఆమె స్వాధీనంలోలేదు.

ఆయన మరికొంత మోటుగా "జరుగు!" అన్నాడు. ఆమె జరిగింది. అవతలి యువకునితల ఈపర్యాయం ఆమెతో కూడా జరిగి, ఆమె భుజంమీద స్థిరనివాసం ఏర్పరచుకుంది. ఇది క్షమించరాని వ్యవహారంగా పరిణమించడంతో భర్త యువకునివైపు గుడ్లురిమి చూచాడు. ఆమె కప్పుడు కొంత అర్థమయింది. సిగ్గుపడింది. కాని తన తప్పేమీ లేకుండా

తనపై భర్తకు కోపంరావడం మనస్సును బాధించింది. నిస్స హాయంగా, దీనంగా భర్తవైపు చూసింది. ఇంకా ఆ యువ కుడు తన తల పక్కకు తీసుకోనైనాలేదు. ఆమెను తిరిగి నిద్ర ముంచెత్తింది.

భర్తకు కోపం అధికమైంది. బల్ల మీదనుంచిలేచాడు. ఈ సారి గట్టిగానేతట్టి భార్యను లేపాడు. తానేమో బల్ల దగ్గర కింద ఉన్న పెట్టెమీద కూర్చుని, భార్యను బల్లచివరకు జరగమన్నాడు. ఆమె జరిగింది. కాని ఆమె కళ్ళల్లో అదే నిస్సహాయత, అదే బాధ.

ఆ పక్క యువకుడుకూడా ఆమెతోపాటుగా పక్కకు వాలాడు. ఆమెకు ఈ పర్యాయం భర్తకోపం గుర్తుందేమో మోచేతులు కాళ్ళమీద ఆనుకుని, ముందుకువంగి, చేతుల్లో తలపెట్టుకుని తిరిగి నిద్రపోయింది. ఈ పర్యాయం ఆ యువకుని తల ఆమె వీపు ఆధారం చేసుకుంది.

అంతే— ఆ భర్త రుద్రుడయ్యాడు. కూర్చున్నచోటు నుంచి లేచాడు. భార్యను లేపాడు. లేచింది. మంచినీళ్ళు ఇమ్మన్నాడు. లేచి మరచెంబు బల్లక్రిందనుంచి తీసి, మంచి నీళ్లు ఇచ్చింది. కింద తను కూర్చున్న పెట్టెమీద కూర్చో మన్నాడు. ప్రపంచానికి దూరంగా జడపదార్థాలైన పెట్టెలు పరుపుచుట్టలు ఉన్నచోట కూర్చుంది. భర్త తిరిగి తన మొదటి స్థానంలో కూర్చుని, అవతలి యువకునివైపు జుగుప్సతో చూసి, మౌనంగా ఉన్నాడు. అతడేమో ఈ

నాటకంతో తనకేమీ సంబంధం లేనట్లు, ఏ ఆధారమూ లేకుండా తల గాలిలో వ్రేలాడేసి అలాగే నిద్రపోతున్నాడు.

ఇక ఆమెకు ఎటు వాలటానికికాని, చేరబడడానికికాని అవకాశంలేదు. కళ్ళు తెరచి కూర్చుని, నిద్రపోకుండా ఉండ డానికి శక్తిలేదు. భర్తకోపానికి విరుగుడులేదు. మరొకవంక సిగ్గు బాధిస్తోంది. అలాగే తల పైకెత్తి, నిస్సహాయంగా అరమోడ్పు కన్నులతో, ఆ పెట్టె అంతా ఒక్కపర్యాయం కలయచూసింది. చివరికి ఆమె కళ్ళు గుమ్మం దగ్గర నిలబడి ఉన్న నా మీద పడ్డాయి.

కుడికాలి మీద బరువు ఎడమ కాలిమీదికి మార్చు కుంటూ, అంతే- నిస్సహాయంగా దీనంగా నేను కూడా ఆమె కళ్ళల్లోకి చూశాను.

సరిగ్గా ఆ సమయంలో నాకు మరొక ఉదంతం తలం పుకు వచ్చింది.

ఒకప్పుడు ఒక మిత్రుని ఇంటికి వెళ్ళాను. నా మిత్రుని కొడుకు ఎనిమిది తొమ్మిదేళ్ళవాడు తన కుక్క పిల్లతో ఆడుకుంటూ దానికి గమ్మత్తులు నేర్పుతున్నాడు.

కుక్కపిల్ల ఎదురుగా కర్రపుల్ల పెట్టి 'ఊఁ' అన్నాడు. వెంటనే దాన్ని చేత్తో పట్టుకుని పైకెత్తి పుల్లమీద నుంచి దాటించాడు. తిరిగి కుక్కపిల్ల మొదటి స్థానంలో కూర్చో పెట్టాడు. దాని ఎదుట కర్రపుల్లపెట్టి 'ఊఁ' అని సౌంజ్ఞ

చేశాడు. అది అర్థం కాని చూపు చూసి కదలకుండా అలాగే కూర్చుంది.

కోపం వచ్చిందేమో ఒక్క దెబ్బ వేశాడు. ఆ కుక్క పిల్ల నిస్సహాయంగా దీనంగా వాడివైపు చూచింది. తిరిగి కర్రపుల్ల దాని ఎదుట పెట్టి దూకమన్నాడు. అది అలాగే కూర్చుని ఉంది.

ఏమనుకున్నాడో దానికి మళ్ళీ పాఠం చెప్పాడు. తిరిగి పరీక్షాసమయం ఆసన్నమైంది. సంజ్ఞ చేసి దూకమన్నాడు. అది దూకలేదు. కొట్టాడు. నాలుగయిదు పర్యాయాలు ఇలాగే జరిగింది. ఆ పిల్లవాడు దూకమని ఆదేశించడము, వాడు కొట్టడము, అది నిస్సహాంగా వాడివైపు చూస్తూ ఉండడము జరిగింది.

ఆ బాలుడికి కోపం రెచ్చిపోయింది. ఆఖరి దెబ్బ గట్టిగా తగిలింది. అది అన్ని పర్యాయాలు దెబ్బలుతింది. అర్థంకాని బాధపడింది. తన తెలివి తక్కువకు లోలోపల సిగ్గుపడిందేమో, తిరుగుబాటు చేయలేదు. ఆఖరికి తన చిన్న యజమానిదగ్గరనుంచి పారిపోయి, ఆ బాధ తప్పించుకోడానికైనా ప్రయత్నించలేదు. కాని, ఆఖరిదెబ్బ మాత్రం భరించలేకపోయిందికాబోలు- వేదనాసూచకంగా ఒక్క మూలుగు మూలిగింది. ఆ సమయంలో ఆ కుక్కపిల్ల కూడా తన బాధ తప్పించమనికాబోలు- ఆ గది అంతా నిస్సహాయంగా కలయ చూసింది.

తన ప్రియమైన కుక్కపిల్ల మూలుగు ఆ బాలుని హృదయం కరిగించిందేమో— అమాంత దాన్ని పైకెత్తి పొదివి పట్టుకుని, "ఫరవాలేదులే టైగర్! పాపం, నీకు రాలేదేం? మళ్ళీ ఇంకోసారి చెబుతాలే!" అంటూ దాన్ని ముద్దుపెట్టుకున్నాడు.

ఆ కుక్కపిల్ల తన బాధంతా ఒక్క తృటిలో మరచిపోయి— ఆనందంతో, కృతజ్ఞతతో ఒళ్ళంతా ఒణికిపోతూ ఉండగా తన చిన్ని యజమానిమూతి ఆప్యాయంగా నాకింది.

ఇంతకూ అంతలోనే నేను దిగిపోవలసిన స్టేషన్ రావడంచేత, ఆ నా రైలు మిత్రుల ఉదంతం ఏవిధంగా ముగిసిందో చెప్పలేనందుకు క్షమిస్తారు కదూ!